క్లుప్తంగా

మాసానిగూడలో గాలికుంటు టీకాలు

శంకర్‌పల్లి: గాలికుంటు టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని మాసానిగూడ సర్పంచ్ రాములు పేర్కొన్నారు. సోమవారం గ్రామంలోని పశువులకు గాలికుంటు టీకాలను వేయించారు. పశువైద్యాధికారి జయసుధ మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర నీరసం ఉంటుందని, నోట్లో పుండ్లు వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఏ రాజ్యలక్ష్మి, వినోద, శాంతమ్మ, సుగుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సాగులో సూచనలు పాటించాలి

ఏడీఏ రాజారత్నం



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ రాజారత్నం

కేశంపేట: రైతులు సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం అన్నారు. మండల పరిధిలోని అల్వాల, కేశంపేట, కాకునూర్ గ్రామాల్లో వర్షాలు లేక ఎండిపోతున్న మొక్కజొన్న, పత్తి పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. వర్షాలు అనుకున్న స్థాయిలో లేకపోవడంతో మొక్కజొన్న, పత్తి పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఎండిపోతున్న పంటలకు 2శాతం యూరియా లేకుంటే 5–10 ఎం.ఎల్ నానో యూరియాను పంటల పైన పిచికారీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శిరీష, వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, సుధ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

కొత్తూరు: కొత్తూరు పట్టణం సమీపంలోని రైల్వే వంతెనకు ఇరువైపులా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సత్యసాయి కాలనీవాసులు కోరుతున్నారు. వంతెనపై సరైన వెలుతురు లేని కారణంగా రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నట్లు పేర్కొన్నారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు వంతెనపై రోడ్డు చాలాచోట్ల గుంతలమయంగా మారిందన్నారు. గుంతలను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు వివరించారు.సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మేలురకంతో అధిక ఆదాయం

పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

షాబాద్: పాడి అభివృద్ధితోనే గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా స్వయం సమృద్ధిని సాధిస్తాయని రేగడి దోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎల్‌డీఓ డాక్టర్ కవిత పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 80 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, పశువుల్లో గర్భకోశ వ్యాధి చికిత్సలు, గాలికుంటు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి రాబట్టవచ్చునని, మేలు రకం పశువుల ఎంపిక ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. గోపాల మిత్ర విద్యాసాగర్, సిబ్బంది శ్రీను, కృష్ణమూర్తి, శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యుదాఘాతానికి గురై..

- వలస కార్మికుడి మృతి
- షాబాద్ పీఎస్ పరిధిలో ఘటన

షాబాద్: విద్యుదాఘాతానికి గురైన ఓ వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాలు.. షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామ శివారులో గల పాల పరిశ్రమలో ఒడిశాకు చెందిన సిమాన్(21) కొంతకాలంగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం పరిశ్రమలో ట్రాక్టర్ శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. విషయం గమనించిన తోటి కార్మికుడు చికిత్స నిమిత్తం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించడంతో మొయినాబాద్ సమీపంలోని భాస్కర ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సీమాన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కొత్తూరు: మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో



షాద్‌నగర్: బీఆర్ఎస్ నేతల ర్యాలీ



షాద్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బీఆర్ఎస్ నేతల సంబురాలు

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీనుంచి పోటీచేసే అభ్యర్థుల లిస్టును సోమవారం సీఎం కేసీఆర్ విడుదల చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు, చేవెళ్ల నియోజకవర్గ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఖరారు చేశారు. ఈ సందర్భంగా వారి అనుచరులు ఆయా నియోజవర్గాల పరిధిలో సంబురాలు చేసుకున్నారు. బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. మరోసారి తమ నేతలను ఎమ్మెల్యేలుగా గెలుపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



కేశంపేట: కొత్తపేటలో బీఆర్ఎస్ నేతల సంబురాలు



పూజల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, నాయకులు

ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

షాద్‌నగర్: గరుడ పంచమిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట ఉన్న గరుత్మంతుడికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సిహులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, మాజీ చైర్మన్ విశ్వం, రమేష్, ఒగ్గుకిషోర్, చింటు, వెంకట్‌రావు, నర్సింహ, సాయిశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అంతయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, నర్సింహగుప్త, ఆనంద్, జనార్ధన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆహారభద్రతలో రైతులది కీలకపాత్ర

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారధివర్మ

మొయినాబాద్‌రూరల్: వ్యవసాయ రంగంలో ప్రతిష్టాత్మకమైన ఏరువాక.. కిసాన్ అత్యుత్తమైన నైపుణ్యం గుర్తించడంలో భాగంగా వార్షిక అవార్డులు అందజేయడం అభినందనీయని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ సమీపంలోని కె.ఎల్.యూనివర్సిటీలో ఏరువాక ఫౌండేషన్ భాగస్వామ్యంతో రైతులకు పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్థసారధివర్మ పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో రైతులది కీలక పాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌టీఐఎఫ్–టీబీఐసీఈఓ అలోక్, ఏసీఐసీకేఎల్ సీఈఓ రమణ్‌కాంత్, ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ ఫైనాన్స్ ఫుడ్ ప్రాసెసింగ్ సీతారామంజనేయులు, వెంకటేశ్వర్లు, మహ్మద్ ఆలీ, నవరత్నకుమార్ స్వామి, భరతయ్య తదితరులు పాల్గొన్నారు.



గోవిల్ అలోక్‌కు మెమంటో అందజేస్తున్న పార్థసారధివర్మ

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

- రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక సలహాదారుడు రాంచందర్ యాదవ్

షాద్‌నగర్: ప్రభుత్వం యాదవ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక సలహాదారుడు బేరి రాంచందర్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు నడికూడ రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో సంఘం ముఖ్య సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బేరి రాంచందర్ యాదవ్ మాట్లాడుతూ... ప్రభుత్వం యాదవుల అభివృద్ధికి మరింత కృషి చేయాలని అన్నారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో 18శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలని, ఎస్ఎస్‌టీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా యాదవులకు విద్యా, ఉద్యోగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని పార్టీలు యాదవులకు తగిన గుర్తింపు ఇవ్వాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం యాదవులందరు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. కలిసికట్టుగా ఉంటే సమస్యలు సులభంగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈనెల 25న హైదరాబాద్‌లోని నాగోల్‌లో యాదవ యుద్ధ భేరిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాదవులందరూ పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. యుద్ధభేరికి సంబంధించి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మధు, సత్యనారాయణ, రాములు యాదవ్, జగదీష్, జగన్, బాల్‌రాజ్, రామకృష్ణ, చంద్రయ్య, మల్లేష్‌యాదవ్, చంద్రయ్య, రమేష్, బుచ్చయ్య, రాజు, రేణుకేష్ యాదవ్, నడికూడ అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్ యాదవ్

కార్మికులు లేబర్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

- బీఎస్పీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి

షాబాద్: కార్మికులు లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీఎస్పీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లగల్లా యాదగిరి పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో బీఎస్పీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు కర్రె శ్రీశైలం, మండల అధ్యక్షుడు మళ్లీ వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లేబర్ ఇన్సూరెన్స్ కలిగిన కార్మికులు సహజ మరణం పొందితే రూ.1లక్ష 30వేలు వస్తుందన్నారు. ప్రమాదవశత్తు మృతి చెందితే రూ.6లక్షలు వర్తిస్తుందన్నారు. ఒక ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒక్కొక్కరికి వివాహ నజరానా రూ.30వేలు, ప్రసవ కానుకగా, రూ.30వేలు చొప్పున వచ్చే అవకాశం ఉందన్నారు. బీఎస్పీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కర్రె శ్రీశైలం, మండల అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ... మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే బీఎస్పీ పోరాటం చేస్తుందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక...

షాబాద్ మండల కార్మిక విభాగం అధ్యక్షుడిగా కర్రె రవికుమార్, ఉపాధ్యక్షులు ఎస్.మల్లేష్, కార్యదర్శి రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి గణేష్, ట్రెజరర్ సురేష్, కార్యదర్శి భాస్కర్, సలహాదారులు బైండ్ల స్వామి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, కృష్ణయ్య, జంగయ్య, మహేందర్, పోచయ్య, శ్రీధర్, సురేందర్, రాంబాబు తదితరులున్నారు.



రవికుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న యాదగిరి

చంద్రశేఖర్‌కు ఘన నివాళి

షాబాద్: లద్దాఖ్‌లోని భేరి ప్రాంతంలో ఆర్మీ వాహనం లోయలో పడి మృతి చెందిన వీర జవాన్ నీరటి చంద్రశేఖర్ ముదిరాజ్ కుటుంబానికి అండగా ఉండాలని షాబాద్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు లింగం అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో వీర జవాన్ నీరటి చంద్రశేఖర్ ముదిరాజ్ చిత్రపటానికి సోమవారం ఆ సంఘం నేతలు నివాళులర్పించారు. దేశ రక్షణలో వీర మరణం పొందిన జవాన్ నీరటి చంద్రశేఖర్ సేవలను కొనియాడారు. రంగారెడ్డి జిల్లా కొందర్గు మండలం తంగెళ్లపల్లి పంచాయతీ పరిధిలోని తిర్మన్‌దేవునిపల్లి చంద్రశేఖర్ స్వగ్రామమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటయ్య, సంఘం నాయకులు నర్సింహులు, బాల్‌రాజ్, శ్రీనివాస్, శివ, వెంకటయ్య తదితరులున్నారు.



చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: రాష్ట్ర ప్రజలందరి ఆశీర్వాదం సీఎం కేసీఆర్‌పై ఉందని.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తనపై ఎంతో నమ్మకం ఉంచి 4వసారి టికెట్ కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ తనపై పెట్టిన నమ్మకాని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. షాద్‌నగర్ ప్రగతికి సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి కేటాయించి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని అన్నారు. తెలంగాణ మరింత అభివృద్ధి సాధించాలంటే సీఎం కేసీఆర్ నాయకత్వం అవసరం అని అన్నారు. ప్రజలందరి ఆశీర్వాదం సీఎం కేసీఆర్‌పై ఉన్నాయని, సీయంగా ఆయన హ్యాట్రిక్ సాధించడం ఖాయమని అన్నారు. మరోసారి షాద్‌నగర్‌నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తాన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం తదితరులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగులగొట్టి..

- రూ.20లక్షలతో ఉడాయించిన దుండగులు
- చేవెళ్ల పీఎస్ పరిధిలో ఘటన

చేవెళ్ల: ఆగిఉన్న కారు అద్దాలు పగులగొట్టి రూ.20లక్షల నగదును అపహరించిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు... చేవెళ్ల గ్రామానికి చెందిన ఉడుత రాఘవేందర్ గుప్తా సోమవారం ఇంట్లో నుంచి రూ.20లక్షల నగదును తీసుకొని చేవెళ్లలోని యాక్సిస్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు వెళ్లాడు. అయితే అక్కడ డిపాజిట్ చేసేందుకు సమయం అయిపోయిందని రేపు డిపాజిట్ చేయమని మేనేజర్ చెప్పడంతో ఆ డబ్బును తన కారులో పెట్టుకొని బయలు దేరాడు. ఈ క్రమంలో మార్గ మధ్యలో మండల కేంద్రంలోనే ఓ చిట్ కంపెనీ యజమాని వద్దకు పని ఉందని వెళ్లాడు. అతని ఇంటి ముందు కారు ఆపి లోపలికి వెళ్లాడు. డబ్బులు కారులోనే ఉన్నాయి. అయితే డబ్బులు కవర్‌లో తీసుకెళ్తున్న విషయాన్ని బ్యాంక్ వద్ద గమనించిన దుండగులు అతడిని బైక్‌పై ఫాలో అయి.. అతడు కారు ఆపి లోపలికి వెళ్లిన వెంటనే రాయితో కారు అద్దాలు పగులగొట్టి కారులో ఉన్న రూ.20లక్షల నగదు ఉన్న కవర్‌ను తీసుకొని ఉడాయించారు. స్థానికులు గమనించి రాఘవేందర్‌గుప్తాకు సమాచారం ఇచ్చారు. దుండగులను వెబండించే ప్రయత్నం చేసినప్పటికీ వారు దొరకలేదు. వెంటనే విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా రెండు బైక్‌లపై నలుగురు దుండగులు వచ్చినట్లు వారిలో ఒకడు బైక్ దిగి కారు అద్దాలు పగులగొట్టి చోరీచేసి పారిపోయినట్లు రికార్డు అయింది. అయితే సీసీ టీవీలో వారి ఫేస్‌లు, బైక్‌ల నెంబర్లు స్పష్టంగా లేకపోవటంతో వాటిని పరిశీలించేపనిలో పడ్డారు పోలీసులు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కేశంపేటకు ఒడిశా బృందం

కేశంపేట: మహిళా సమాఖ్యల పనితీరును పరిశీలించేందుకు మంగళవారం మండలంలో ఒడిశా బృందం పర్యటించనున్నట్లు ఏపీఎం భగవంతు తెలిపారు. ఉదయం 9గంటలకు మండల కేంద్రంలోని సమాఖ్య భవనంలో వ్యవసాయ పరికరాల అద్దెకేంద్రంతో పాటు భూతల్లి మహిళారైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను పరిశీలిస్తారని ఆయన తెలిపారు.

ఘనంగా నాగుల పంచమి



పుట్టలో పాలుపోస్తున్న మహిళలు

మొయినాబాద్: నాగుల పంచమి వేడుకలను సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసం సోమవారం, నాగుల పంచమి కలిసి రావడంతో మహిళలు నాగదేవతలకు పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో నాగదేవత విగ్రహాలకు, పుట్టల్లో పాలుపోసి నాగదేవతను పూజించారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

కేశంపేట: గృహ యజమనురాలు అనుమతి లేకుండా అక్రమంగా నిర్మించుకున్న రేకులషెడ్‌ను ఇటీవల నోటీసులు అందించి గ్రామ పంచాయతీ తొలగించింది. దీంతో ఆమె మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆత్మాత్మహత్యాయత్నం చేసింది.. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నీలమ్మకు గ్రామ పంచాయతీ రికార్డుల ప్రకారం 143 గజాల స్థలం ఉంది. ఈ స్థలం కాకుండా ఇంటిముందు అక్రమంగా 8 గజాలలో ఆమె రేకులషెడ్‌ను వేసుకుంది. ఇట్టి నిర్మాణం అక్రమంగా ఏర్పాటు చేసుకున్నారని తొలగించాలని గ్రామ పంచాయతీ నోటీసులను అందించింది. అయినా స్పందించకపోవడంతో సోమవారం గ్రామ పంచాయతీ అధికారులు జేసీబీ సహాయంతో రేకులషెడ్‌ను తొలగించారు. ఇదే విషయమై ఇంటి యజమానురాలు మండల పరిషత్ కార్యాలయం వద్ద వచ్చి ముఖద్వారం వద్ద ఉరివేసుకునే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు ఆమెను అడ్డుకొని సముదాయించి ఇంటికి పంపించారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

మంగళూరు ఎమ్మెల్యే వేదవ్యాస్

షాద్‌నగర్: అభివృద్ధి, సంక్షేమమే బీజేపీ లక్ష్యమని మంగళూరు ఎమ్మెల్యే వేద వ్యాస్ కామత్ అన్నారు. అసెంబ్లీ ప్రవాస్ యోజనలో భాగంగా సోమవారం షాద్‌నగర్ బీజేపీ కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందని అన్నారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. సీఎం కేసీఆర్ హామీలను అమలులో పూర్తిగా విఫలం అయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, దేపల్లి అశోక్, వెంకటేష్‌గుప్త, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మిధున్‌రెడ్డి, శ్రీనివాస్, మఠం రుషికేష్, వెంకటేష్, సాయిబాబ, గణేష్, సురేష్, రఘుగౌడ్, హన్మంత్, భీమయ్య, చందర్‌నాయక్, విష్ణు, లింగంనాయక్, భరత్, రవికాంత్‌రెడ్డి, కృష్ణ, శివశంకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభను విజయవంతం చేయాలి

సభ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే సీతక్క

చేవెళ్ల: ఈనెల 26న చేవెళ్లలో జరిగే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులంతా కలిసి కట్టుగా పనిచేయాలని చేవెళ్ల సభ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చేవెళ్ల పార్లమెంట్ స్థాయి ముఖ్య నాయకులతో సన్నహాక సమావేశం నిర్వహించి సభాస్థలాన్ని పరిశీలించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, డీసీసీ అధ్యక్షుడు చల్లానర్సింహారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా స్థలాన్ని పరిశీలించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గాల వారీగా జనసమీకరణకు సంబంధించి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు వసంతం, దర్శన్, బీంభరత్, శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీతక్క తదితరులు